పశుగ్రాసం... తిప్పలే!

- తగ్గిన వరి సాగు... వరిగడ్డికి పెరిగిన డిమాండ్
- ట్రాక్టర్ గ్రాసం రూ.12 వేలు.. బాడుగ అదనం
- భారంగా మారిన పశుపోషణ... ఆందోళన చెందుతున్న రైతులు



ట్రాక్టర్‌తో వరిగడ్డిని తీసుకెళ్తున్న దృశ్యం



వరి పైరును యంత్రంతో కోస్తున్న దృశ్యం

నందికొట్కూరు: వర్షాభావ పరిస్థితులు అన్నదాతను వెంటాడుతున్నాయి. అన్నదాతకు ఖరీఫ్ సీజన్ ఏ మాత్రం కలిసి రాలేదు. తుపాన్ ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వర్షాభావ పరిస్థితులకు ఎదొరొడ్డి పండించిన దిగుబడులకు సైతం గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు నష్టాలు చవిచూశారు. ఈ నేపథ్యంలో పశుపోషణ ప్రశ్నార్థకంగా మారింది. ప్రత్యేకించి వరిసాగు తగ్గడం, తుపాన్ ప్రభావం మూలంగా గ్రాసం కొరత ఏర్పడింది. దీంతో రైతులతోపాటు పాడిరైతులు పశు పోషణపై ఆందోళన చెందుతున్నాడు. ఈ ఏడాది సెప్టెంబర్ మొదటి వారంలో కేసీ కెనాల్‌కు నీరు రావడంతో నందికొట్కూరు నియోజకవర్గంలో 4,082 హెక్టార్లలో వరి పంటను రైతులు సాగు చేశారు. నందికొట్కూరు మండలం-550, జూపాడుబంగ్లా మండలం-660, పగిడ్యాల మండలం-654, మిడుతూరు మండలం-150, పాములపాడు మండలం-626, కొత్తపల్లి మండలం-1646 హెక్టార్లు వరి పంటను రైతులు సాగు చేశారు. కేసీ కెనాల్‌కు సకాలంలో నీరు రాకపోవడంతో సగానికి పైగానే రైతులు వరిసాగు చేయలేదు. కూలీల రేట్లు కూడా పెరగడంతో రైతులు వరికోత యంత్రాలపై ఆధారపడుతున్నారు. యంత్రాల ద్వారా కోసినా గడ్డి పశువులకు గ్రాసంగా ఏ మాత్రం ఉపయోగపడదు. దీంతో పశుగ్రాసం కొరత ఏర్పడింది. పశువుల పోషణ భారంగా మారనుంది. ఈ సమస్యను అధిగమించలేమనుకుంటున్న రైతులు పశువులను విక్రయించేందుకు సిద్ధం అవుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమానికి పెద్ద పీఠ వేశామని గొప్పలు చెప్పడమే తప్ప ఒక పైసా కూడా పశుగ్రాసం కోసం కేటాయించిన చరిత్ర లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

భగ్గుమంటున్న వరిగడ్డి ధర

కేసీ కెనాల్ ఆయకట్టుకు సకాలంలో సాగు నీరు విడుదల చేయలేదు. దీంతో వరి సాగు విస్తీర్ణం పూర్తిగా తగ్గిపోయింది. దీంతో వరిగడ్డి ధరలు భగ్గుమంటున్నాయి. ఎకరా వరిగడ్డి రూ. 6 వేలు పలుకుతుంది. ట్రాక్టర్ వరిగడ్డికి ధర రూ, 12 వేలు వెచ్చించాల్సి వస్తుంది. అదనంగా ట్రాక్టర్ బాడుగ తప్పదు. గతేడాది కంటే అదనంగా రూ. 2 వేలు పెరిగినట్లు రైతులు అంటున్నారు. దిగుబడులు అంతంతమాత్రమే వచ్చిన నేపథ్యంలో పశుగ్రాసానికి ఈ మొత్తంలో భరించే పరిస్థితి లేదు. దీంతో పశుపోషణ ఎలా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. నందికొట్కూరు నియోజకవర్గంలో అధికారుల లెక్కల ప్రకారం బర్రెలు 46 వేలు, ఎద్దులు, ఆవులు 35 వేలు, గొర్రెలు, మేకలు 2.50 లక్షలు ఉన్నాయి. ప్రభుత్వం స్పందించి పశు గ్రాసం సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

యంత్రాలతో వరి కోయడం వలన కొరత



యంత్రాలతో వరి కోయడం వలన పశుగ్రాసం కొరత ఏర్పడుతుంది. ట్రాక్టర్ గడ్డి రూ, 12 వేలు వెచించి కొనుగోలు చేసే పరిస్థితి లేదు. వేసిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక అల్లాడిపోతున్నాం. ప్రభుత్వం రైతుల గోడు పట్టించుకోవడం లేదు. పశు గ్రాసం సరఫరా చేస్తామని గొప్పలు చేపుకోవడం తప్పా చేసిందేమి లేదు. ప్రభుత్వం ఆదుకోకపోతే పశువులను అమ్ముకోవడం తప్ప వేరే మార్గం లేదు. – రామకృష్ణారెడ్డి, రైతు, మిడతుతూరు

వరి గడ్డిని ముట్టుకుంటే షాక్ కొడుతుంది



వరి గడ్డిని ముట్టుకుంటే కరెంట్ షాక్ కొట్టినట్లే ఉంది. ధరలు బాగా పెరిగాయి. గతేడాది ట్రాక్టర్ వరి గడ్డి రూ. 10 వేలు ఉండగా నేడు రూ. 12 వేలు పలుకుతుంది. పశువులను ఎలా పోషించాలో అర్థం కావడం లేదు. పశువుల గురించి ఆలోచన వస్తేనే చాలా ఇబ్బందిగా ఉంది. మూగజీవాల సమస్యపై ప్రభుత్వం దృష్టి సారించాలి. పశగ్రాసం సరఫరా చేసి ఆదుకోవాల్సిన అవసరం ఉంది. – రవి, రైతు, నందికొట్కూరు

క్లుప్తంగా

జి.వీరాపురంలో మెడికల్ క్యాంపు

కొత్తపల్లి: మండల పరిధిలోని జి.వీరాపురం గ్రామంలో శుక్రవారం వైద్యాధికారి మహమ్మద్ బేగ్ మెడికల్ క్యాంపు నిర్వహించారు. జ్వరం, జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు, బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామాలలోని ప్రజలు 104 వాహనం ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ప్రజలపై విద్యుత్ చార్జీలు భారం తగదు

కొత్తపల్లి: విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారాలు వేయడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానుకోవాలని మండల కార్యదర్శి ఎస్ స్వాములు డిమాండ్ చేశారు. శుక్రవారం సింగరాజుపల్లెలో పెరిగిన విద్యుత్ చార్జీలకు నిరసనగా కరెంట్ బిల్లులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రూఅప్‌చార్జీలు, సర్దుబాలు చార్జీలు అంటూ రకరకాల పేర్లతో ప్రజలపైన కరెంటు చార్జీల భారం మోపడం భావ్యం కాదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దాసు, దేవకుమార్, ప్రజలు రాజు, బాబు, పకీరయ్య, పేతురు, నరసింహుడు, బాలరాజు తదితరలు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: విద్యుత్‌చార్జీలు పెంచమని హామీ ఇచ్చిన చంద్రబాబునాయుడు సీఎం కాగానే పెంచడం తగదని సీపీఎం పార్టీ మండల కన్వీనర్ కర్ణ, కోకన్వీనర్ ఆకులరాము తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలో పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ బిల్లులను కాల్చి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శివ, లోకారెడ్డి, నరసింహ, బాషా, తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక సచివాలయ ఉద్యోగి మృతి



అరుణ్‌కుమార్(ఫైల్)

కొత్తపల్లి: కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సచివాలయ ఉద్యోగి తప్పేట అరుణ్‌కుమార్ (25) కోలుకోలేక శుక్రవారం మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రం కొత్తపల్లికి చెందిన తప్పేట నాగరాజు, లలితమ్మల రెండవ కుమారుడు తప్పేట అరుణ్‌కుమార్ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయ ఉద్యోగం పొందాడు. ఆత్మకూరు పట్టణం ఎస్‌పీజీ పాలెం సచివాలయం-1లో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ డిప్యూటేషన్‌పై కర్నూలు వెళ్లారు. పదిరోజుల కిందట ఎడమ కాలికి దెబ్బతగిలి ఇన్‌ఫెక్షన్ అయ్యింది. కాలికి ఆపరేషన్ పూర్తయ్యాక ఉన్నట్టుండి అరుణ్ కుమార్ కోమాలోకి వెళ్లాడు. తెల్లవారుజామున మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో కోల్‌కత్తా మెట్రో రైల్వే జీఎం



మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చిన జీఎం ఉదయ్‌కుమార్‌రెడ్డి దంపతులు

మహానంది: కోల్‌కత్తా మెట్రో రైల్వే జనరల్ మేనేజర్ పి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, కుటుంబ సభ్యులు శుక్రవారం రాత్రి మహానందీశ్వరస్వామిని దర్శించుకున్నారు. వారికి ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి స్వాగతం పలికారు. కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం వారికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు. ఆయన వెంట రైల్వేశాఖ డీసీఎం కమలాకర్‌బాబు, ఏడీఈఎన్ తిరుమలరావు, ఎస్ఎస్ఈ వెంకటయ్య, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, రైల్వే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం ఉన్నారు.

మహానందిలో భక్తజనసందడి

మహానందిలో శుక్రవారం భక్తజన సందడి నెలకొంది. వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చి కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజల అనంతరం భక్తులు కోదండరామాలయం, వినాయకనంది, గరుడనంది ఆలయాలను సందర్శించి భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

నందికొట్కూరు: మాదిగల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ పోరాడుతుందని, ఆ సంఘం జిల్లా నాయకులు కోట ప్రభాకర్ మాదిగ అన్నారు. శుక్రవారం పట్టణంలోని రబ్బానీ కాంప్లెక్స్‌లో ఎమ్మార్పీఎస్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు మేరకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జాన్, దేవన్న, ఈశ్వరయ్య, ప్రకాశం, నాగరాజు, గోపాలం, మోహన్, వెంకరమణ పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైలంటెంపుల్: ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై శుక్రవారం కర్నూలుకు చెందిన సాయిలలిత కళాక్షేత్రం వారి కూచిపూడి నృత్యప్రదర్శన ప్రదర్శించారు. మహాగణపతిం, శివాష్టకం, మూషికవాహన, మహిషాసురమర్ధిని, శివతాండవం, శంభో శివ శంభో, ఓం నమఃశివాయ తదితర గీతాలకు, అష్టకాలకు పూజిత, సుదీక్ష, గీతాస్వీత, మోక్షశ్రీ, మనుశ్రీ, ప్రణవి, శ్రీవిద్య, హర్షశ్రీ, సత్యకీర్తన, ఇందు, మనస్విని, రాజతరుణీ, జ్యోతిక తదితరులు నృత్యాలు ప్రదర్శించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పగిడ్యాల: రెండవ శనివారం సందర్భంగా స్థానిక 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ క్రాంతికుమార్ ఏఈఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు. అలాగే వ్యవసాయానికి సంబంధించి ఉదయం 5 గంటల నుంచి సరఫరా ఉంటుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సాగునీటి సంఘం ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకోండి

మిడుతూరు: సాగునీటి సంఘం ఎన్నికలు ప్రశాంతగా నిర్వహించుకోవాలని ఎస్ఐ ఓబులేసు సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని, అధికారులు,పోలీస్ సిబ్బందికి సహకరించాలని చెప్పారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

పాములపాడు: మండలంలో శనివారం నీటి సంఘం ఎన్నికలు జరుగనున్నాయి. ఇందుకు సంబంధించి తహసీల్దార్ సుభద్రమ్మ శుక్రవారం మండలంలోని పాములపాడు, మద్దూరు, వాడాల, వేంపెంట పోలింగ్‌కేంద్రాలను పరిశీలించారు. రైతులు ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ సూచించారు.

ప్రణాళికలతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం



శిక్షణా తరగతిలో మాట్లాడుతున్న స్టేట్ అబ్జర్వర్ వెంకటరత్నం

పాములపాడు: ప్రణాళికలు సిద్ధం చేసుకొని ఆ మేరకు పనులు చేసూకుంటూ పోతేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని స్టేట్ అబ్జర్వర్ వెంకటరత్నం పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రెండవ రోజు శుక్రవాం జరిగిన స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు శిక్షణా తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణా తరగతుల్లో తెలియజేస్తున్న 9 అంశాలు చాలా కీలకమైనవన్నారు. ప్రధానంగా సర్పంచులు ఆయా గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించాలని, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. అధికారులు, సర్పంచులు కలిసి కట్టుగా సహకరించుకుంటూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, డాక్టర్ నాగలక్ష్మి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సువర్చల, ఏపీఎం ఉమామహేశ్వరి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రెండు రోజులపాటు నిర్వహించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు శిక్షణా కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన 9 థీమ్‌లు ఎంతో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేంద్రయ్య, ఎంఈఓలు సుభాన్, మురళీమోహన్ రెడ్డి, ఏఈలు శివకుమార్, జావేద్, ఏపీఓ మద్దిలేటి, ఎంపీహెచ్‌ఎస్ మల్లేశ్వరి, ఏపీఎం కళావతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శేషమ్మతదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో శుక్రవారం ఎంపీడీఓ మేరి అధ్యక్షతన జరిగిన గ్రామాభివృద్ధి ప్రణాళిక శిక్షణా కార్యక్రమాన్ని స్టేట్ అబ్జార్వర్ (పంచాయతీ రాజ్ శాఖ) వెంకట రత్నం పరిశీలించారు. మౌళిక వసతుల కల్పనకు, అభివృద్ధి పనులకు అవసరమైన ప్రణాళిక రూపొందించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం పుల్లయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జూబేద్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: మహిళాభివృద్ధితోనే గ్రామాభివృద్ధి సాధ్యమని ఏపీఎం అంబమ్మ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనపై సర్పంచులు, మండలస్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులకు రెండోరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఏపీఎం అంబమ్మ మాట్లాడుతూ మహిళలు చదువుతో పాటు ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, మండల స్థాయి అధికారులు, గ్రామసచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడి పిరికిపంద చర్య



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏపీయూడబ్ల్యూజే, కమ్యూనిస్టు నాయకులు

నందికొట్కూరు: రాజకీయ కక్షలు ఉంటే రాజకీయంగా చేసుకోవాలే తప్పా జర్నలిస్టులను టార్గెట్ చేసి దాడి చేయడం పిరికిపంద చర్య అని ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గ అధ్యక్షుడు నగేష్, కమ్యూనిస్టు నాయకులు రఘురామ్మూర్తి, వెంకటేశ్వర్లు హెచ్చరించారు. వైఎస్సార్ కడప జిల్లా, మండల కేంద్రం వేములలో నీటి సంఘాల ఎన్నికలను కవరేజీకి వెళ్లిన సాక్షి జర్నలిస్టులు శ్రీనివాసులు, రాజారెడ్డి, కెమరామెన్ రాముపై అధికార పార్టీ నేతలు దాడిని ఖండిస్తూ శుక్రవారం ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులు నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేములలో జర్నలిస్టుల కెమెరాలను, సెల్ ఫోన్లను అధికారపార్టీ నాయకులు లాక్కొని పగులకొట్టడం దారుణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టులకు రక్షణ కల్పించేందుకు ఉన్న చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి దాడికి పాల్పడిన టీడీపీ నాయకులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు చంద్రశేఖర్, నరేష్, గోపి, జయరాజు, ప్రేమ్‌కుమార్, ఆంజనేయులు, ప్రదీప్, స్వామన్న, ఖలీల్, స్వాములు, రాజా, కమ్యూనిస్టు నాయకురాలు బీబీ, తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల: వేముల మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద సాగునీటి వినియోగదారుల సంఘం ఎన్నిక కవరేజ్ కోసం వెళ్లిన సాక్షి విలేకరులపై దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఎం మండల కార్యదర్శి పక్కీర్‌సాహెబ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని ధ్వజమెత్తారు. ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై ప్రత్యక్ష దాడులకు పాల్పడడమే కాకుండా అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురిచేసి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నడిపిస్తున్నారని మండిపడ్డారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరుగకుండా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పాత్రికేయులకు రక్షణ కల్పించి ఆదుకోవాలన్నారు.

అంధకారంలో తాటిపాడు రోడ్డు

జూపాడుబంగ్లా: కేజీ రోడ్డు నుంచి తాటిపాడు గ్రామానికి వెళ్లే రోడ్డు అంధకారంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కర్నూలు-గుంటూరు రోడ్డు నుంచి కిలోమీటరు దూరంలో తాటిపాడు గ్రామం ఉంది. కర్నూలు, నందికొట్కూరు, ఆత్మకూరు, వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లిన గ్రామస్తులు జూపాడుబంగ్లా ఆర్టీసీ బస్టాండు వద్ద దిగి అక్కడి నుంచి కిలోమీటరు మేర కాలినడకన వెళ్లాల్సి ఉంది. రహదారి వెంట ఉన్న విద్యుత్ దీపాలు వెలగకపోవటంతో రాత్రి వేళల్లో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

విద్యుత్ స్టార్టర్ తీగలు మాయం

కొత్తపల్లి: ఎదురుపాడు శివారులోని భాస్కర్ రెడ్డి పొలం బావిలో విద్యుత్ స్టార్టర్, తీగలను గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. శుక్రవారం ఉదయం పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి విషయాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశానని బాధిత రైతు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.10 వేలు అవుతుందని రైతు వాపోయాడు.

మొసలి కలకలం

పాములపాడు: మండలంలోని కేసీ పరివాహక ప్రాంత ప్రజలు మొసలి కలకలంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. బానకచెర్ల గ్రామ సమీపంలోని సాగర్ పవర్‌హౌస్ వద్ద కేసీ కెనాల్‌లో రెండు రోజుల క్రితం మొసలి కనిపించడంతో కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టారు. ఈ విషయం తెలిసి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు, సిబ్బంది 2 రోజుల నుంచి కేసీ కెనాల్ వెంట గస్తీ నిర్వహిస్తున్నా మొసలి ఆచూకీ కనిపించలేదు. ఎలాగైనా మొసలిని సురక్షిత ప్రాంతంలో వదిలేందుకు చర్యలు చేపట్టినట్లు ఫారెస్ట్ రేంజర్ ఖాన్ తెలిపారు. మొసలి మిత్రం సాగర్ పవర్ హౌస్ వద్దనే ఉందని, 2 రోజుల్లో నీరు తగ్గు ముఖం పడితే మొసలి కనింపించే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు.

అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ పోరాటం



జిల్లా కేంద్రం నంద్యాలలో జరిగే ధర్నాకు బయలుదేరిన వైఎస్సార్‌సీపీ నాయకులు

నందికొట్కూరు: రైతులను దగా చేస్తున్న కూటమి సర్కార్‌పై పోరాటం చేసేందుకు వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ డాక్టర్ దార సుధీర్ స్పష్టం చేశారు. శుక్రవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి నంద్యాల జిల్లా కేంద్రంలో అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ ధర్నా కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. జై జగన్, జైజై జగన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలన్నారు. రైతులకు వెంటనే పెట్టుబడి సాయం అందించాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జగదీష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్, నాయకులు పుల్యాల నాగిరెడ్డి, రమేష్‌నాయుడు, కోకిల రమణారెడ్డి, ఉపేంద్రారెడ్డి, లక్ష్మిరెడ్డి, శెట్టిశివ, తిరుమలేష్‌రెడ్డి, శ్రీకాంత్, విజ్జి, వెంకటస్వామి, రవి, నాగేశ్వర రెడ్డి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ధర్నాకు తరలివెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకులు

జూపాడుబంగ్లా: జిల్లా కేంద్రం నంద్యాలలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో పాల్గొనేందుకు జూపాడుబంగ్లా మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు తరలివెళ్లారు. జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోసిక తిరుమలేశ్వరరెడ్డి, మండల అధ్యక్షుడు తోకలకృష్ణారెడ్డి, యువనాయకుడు తరుణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు తరలివెళ్లారు.

ఐదు కులాలను చేర్చాలనే ప్రతిపాదన తగదు



మాట్లాడుతున్న రామకృష్ణ

ఆత్మకూరు: ఓబీసీ కోటా పెంచకపోగా మరో ఐదు కులాలను చేర్చాలని టీడీపీ ప్రతిపాదనలు చేయడం తగదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బాలస్వామి యాదవ్ అన్నారు. బీసీ సంఘం కార్యాలయంలో వారు శుక్రవారం సమావేశమై మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించడం లేదని, బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలని ఎప్పటి నుంచో కోరుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. టీడీపీ ప్రభుత్వం బీసీల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. బీసీల హక్కులు, రిజర్వేషన్ల పెంపు కోసం బీసీ సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రఘురాముడు యాదవ్, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, వీరన్న పాల్గొన్నారు.

మాలలు ఐక్యత చాటుకోవాలి

- 15న గుంటూరులో నిర్వహించే మహాగర్జనకు తరలిరావాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న మాలమహానాడు నాయకులు

నందికొట్కూరు: మాలలు ఐక్యత చాటుకోవాలని, ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలని మాలమహానాడు నాయకులు ఏసీహెచ్ నగేష్, మనోహార్ పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 15న గుంటూరులో చేపట్టనున్న మహాగర్జనకు మాలలు తరలిరావాలన్నారు. ఈ మేరకు శుక్రవారం సీఎస్ఐ పాలెం సమీపానున్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట మహాగర్జన పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేసే హక్కు రాష్ట్ర ప్రభుత్వాలకు లేదన్నారు. పార్లమెంట్ ఆమోదం పొందినప్పుడే ఎస్సీ వర్గీకరణ సాధ్యమని, రిజర్వేషన్లు ఎత్తివే కుట్రలో భాగంగానే క్రిమిలేయర్‌ను తెచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాలమహానాడు సీఎస్ఐ పాలెం నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం



గ్రామోత్సవంలో పాల్గొన్న అయ్యప్ప స్వామి భక్తులు

వెలుగోడు: అయ్యప్ప స్వామి గ్రామోత్సవాన్ని శుక్రవారం అయ్యప్ప స్వాములు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పొట్టి శ్రీరాములు సెంటర్ నుంచి కలశాలతో అయ్యప్ప స్వాములు పురవీధుల గుండా చెన్నకేశవ స్వామి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఉత్సవమూర్తికి విశేష తిరుమంజనం నిర్వహించి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి పడిపూజ మహోత్సవం చేపట్టి ఊంజల సేవ, మహా మంగళహారతులు ఇచ్చి హరి వరాసనంతో విళ్లకి మహోత్సవ వేడుకలను ముగించారు. సత్యం బృందం అయ్యప్ప స్వామి పాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గురుస్వాములు శశిశేఖర శర్మ,చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాసులు, రామ్ కుమార్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి



రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

వెలుగోడు: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్పెషల్ ఆఫీసర్ నాగ మహేశ్వరమ్మ సూచించారు. మండలంలోని మోత్కూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాస గౌడ్ నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆమె హాజరయ్యారు. రైతుల నుంచి వినతులు స్వీకరించారు. భూ సమస్యలపై నాలుగు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు.

ఆత్మకూరు: మండల కేంద్రం ఆత్మకూరులో శుక్రవారం తహసీల్దార్ రత్నరాధిక రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి వినతులు స్వీకరించారు. భూ సమస్యలపై 15 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మనోహర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు అని తహసీల్దార్ రత్నరాధిక అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆత్మకూరు పట్టణంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులకు ఏవైనా భూ సమస్యలు ఉంటే తనదృష్టికి తీసుకురావాలన్నారు. ఆ సమస్యలను వెంటనే విచారణ చేపట్టి పరిష్కరిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని సమస్యలు ఉన్న రైతులు, అన్నివర్గాల వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొత్తం 15 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మనోహర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు గ్రామ రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాగన్న, సర్వేయర్ అతీఫ్, వీఆర్వోలు బాలకృష్ణ, మహేష్, ప్రవీణ్, విలేజ్ సర్వేయర్లు మాధవ్, కుమార్, కిషోర్, గ్రామస్తులు కృష్ణారెడ్డి, లక్ష్మన్నగౌడు, శ్రీనివాసగౌడు, తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరు: మండల పరిధిలోని తలముడిపిలో శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాసులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ భూ సమస్యలపై 17 వినతులు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ కృష్ణుడు, ఆర్ఐ జహంగీర్, వీఆర్వో ఖాదర్ భాష, నాయుకులు వంగాల శివరామిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్‌లో శుక్రవారం తహసీల్దార్ శివరాముడు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో ఏడుగురు రైతులు భూ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్‌లు మధు, మురళీ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీరంగారెడ్డి, సర్వేయర్ జ్ఞానప్రకాష్, వీఆర్వోలు వెంకటస్వామి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండల పరిధిలోని ముసలిమడుగులో శుక్రవారం సర్పంచ్ జమిలాబీ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఉమారాణి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. నలుగురు రైతులు వినతి పత్రాలు అందజేశారని తహసీల్దార్ తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీశైలం, నందికొట్కూరు
70750 09158
Office mail : sakshiknladvt@gmail.com